
ప్రజాశక్తి

గురువారం 22 ఆగస్టు 2024 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

ఫుడ్ పాయిజన్‌తో

'అపోలో' విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను పరామర్శిస్తున్న ప్రభావతిదేవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఫుడ్ పాయిజన్ కారణంగా చిత్తూరు నగరంలోని అపోలో మెడికల్ యూనివర్శిటీ, నర్సింగ్ కళాశాల విద్యార్థులు అస్వస్థతకు గురైయ్యారు. బుధవారం ఉదయం అపోలో మెడికల్ యూనివర్శిటిలో చదువుతున్న మెడికల్, నర్సింగ్ విద్యార్థులు ఒకరి తరువాత ఒకరు విరోచనాలు, వాంతులు చేసుకొని అస్వస్థతకు గురికావడంతో గుర్తించిన యాజమాన్యం ప్రాథమిక వైద్యం అందించి అక్కడి నుండీ సమీపంలోని చిత్తూరు ప్రభుత్వ, అపోలో సౌజన్యంతో నడస్తున్న జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఉదయం 10 గంటల నుండీ సాయంత్రం 4 గంటలకు అపోలో వాహనాల్లో అస్వస్థతకు గురైన విద్యార్థులను తరలించి చికిత్స అందించారు. తమ పిల్లలు ఫుడ్‌పాయిజన్‌తో అనారోగ్యం పాలరయ్యారనే విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు అసుపత్రి వద్దకు చేరుకొని తమ పిల్లల పరిస్థితి ఎలా ఉందని అసుపత్రి వర్గాలతో ఆరా తీశారు. విద్యార్థులు ఆస్వస్థతకు గురికావడంపై అపోలో యాజమాన్యం ఎంత మంది ఫుడ్‌పాయిజన్ వల్ల ఇబ్బంది పడ్డారనే విషయాన్ని స్పష్టంగా తెలుపకపోగా మంగళవారం రాత్రి ఎక్కడో నిర్వహించిన బర్డ్‌డే ఫంక్షన్‌కు వెళ్ళి అక్కడ తిన్న ఆహారం వల్ల ఫుడ్‌పాయిజన్ అయ్యిందని అంటున్నారు. అపోలో యూనివర్శిటీలో 12 వందల మంది పిల్లలు అక్కడి క్యాంటిన్‌లో భోజనం చేశారని మిగిలిన వారందరూ బాగున్నారని 25 మంది మాత్రమే వాంతులు విరోచనాలు చేసుకున్నట్లు చెబుతున్నప్పటికీ అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య వందలో ఉన్నట్లు సహచర మెడికల్ విద్యార్థులు చెబుతున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులు మంగళవారం రాత్రి ఎలాంటి పార్టీకి వెళ్ళలేదని అపోలో క్యాంటిన్‌లో తిన్న ఆహారం వల్లే ఫుడ్‌పాయిజన్ అయిన్నట్లు

2 లో

భారత్ బంద్ అంతంత మాత్రమే..

- **పోలీసుల భారీ బందోబస్తు**



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన భారత్ బంద్ తిరుపతి జిల్లాలో అంతంతా మాత్రమే సాగింది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులు అన్ని పనిచేశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లో, ప్రధాన కూడల్లా వద్ద పెద్దసంఖ్యలో పోలీసులు మొహరించారు. జిల్లావ్యాప్తంగా అక్కడక్కడ దళిత సంఘాల ఆధ్వర్యంలో మానవహారాలు, ర్యాలీలు చేపట్టారు. తిరుపతి జిల్లా కేంద్రంలో మాల మహానాడు, మాల మహాసభ, ఎస్సీ అసోసియేషన్, అంబేద్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీ, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. జ్యోతిరావు పూలే విగ్రహం, టౌన్‌క్లబ్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం

2 లో

చిరుద్యోగుల నిరసన దీక్ష



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి సమీపంలోని శ్రీవారి మెట్లు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీవారి మెట్టు చెరువు వ్యాపారులు సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనం ఎదుట జరిగిన నిరసనను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాలుగా శ్రీవారి మెట్టు నడక మార్గంలో చిరు వ్యాపారాలు వ్యాపారాలు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారని, 31 కుటుంబాలను ఉన్నఫలంగా

2 లో

(మొదటి పేజీ తరువాయి)

చిరుద్యోగుల నిరసన దీక్ష

తరిమేయడం సమంజసం కాదని అన్నారు. వైసిపి హయాంలో ఆ పార్టీ మద్దతుదారులు వీరుపై దాడిలు చేశారని, మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు తెగించి వ్యాపారులను తరిమికొట్టారన్నారు. దీనిపైన స్పందించిన ఈవో ధర్మారెడ్డి వ్యక్తిగతంగా విచారణ చేసి, వీరంతా నిజమైన పేదవాళ్లుగా గుర్తించి వ్యాపారాలకు అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. అలిపిరి నడక మార్గంలో చిరుత భక్తులపై దాడి చేయడంతో దీనిని సాకుగా చూపి శ్రీవారి మెట్టు మార్గంలోని వ్యాపారాలను మూయించేసారన్నారు. గతంలో తిరుమలలో ఉన్న వారిని తిరుపతికి పంపించినప్పుడు వారికి ఇంటి జాగాలో కొండపై షాపులు కేటాయించారని, వీరికి మాత్రం ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చెప్పకపోవడం శోచనీయమన్నారు. సుదీర్ఘ పోరాటాలతో ఎట్టకేలకు ఎన్నికల సమయంలో వీరికి వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేశారన్నారు. కానీ కొత్తగా వచ్చిన ప్రభుత్వం మళ్లీ వీరిపై వేధింపులకు దిగడం బాధాకరమన్నారు. ఫారెస్ట్ అధికారులు నాలుగైదు సంవత్సరాల క్రితం ఇచ్చిన జీవోను సాకుగా చూపి పాత వ్యాపారులను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఈ చిరువ్యాపారుల వల్ల అటు టీటీడీకి ఇటు ఫారెస్ట్ అధికారులకు ఎంతో ఉపయోగకరమన్నారు. సుమారు 170మంది ఎర్రచందనం స్మగ్లర్లను ఇదే వ్యాపారులు పట్టించారని, నడిచిపోయే భక్తులకు అస్వస్థత గురైతే తమ భుజాలపైన మోసుకెళ్లి ఆసుపత్రిలో చేర్పించే వారని, దట్టమైన అడవుల్లో మంటలు వ్యాపిస్తే ఫారెస్ట్ వాళ్లతో కలిసి మంటలు ఆర్పేందుకు సహకరించారని గుర్తు చేశారు. ఇలాంటి వారిపై కక్ష సాధింపులు దిగడం సరైనది కాదన్నారు. వీరి సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే ఈవో, జేఈవో, ఫారెస్ట్ అధికారులు, ఎస్టేట్ ఆఫీసర్, పంచాయతీ సెక్రెటరీ, ఇతరత్రా అధికారులకు అనేకసార్లు విన్నవించినా స్పందించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో నిరసన దీక్షకు దిగాల్సి వచ్చిందన్నారు. ధర్మం గురించి చెప్పే ఆధ్యాత్మిక క్షేత్రం, చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి ఉన్న సంస్థ టిటిడి ఇక్కడ ఇలా వ్యవహరించడం దారుణం అన్నారు. ఇప్పటికైనా టిటిడి అధికారులు స్పందించి శ్రీవారి మెట్టు చిరు వ్యాపారాలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేణుగోపాల్, ఆర్.లక్ష్మి, బుజ్జమ్మ, ఐద్వా కార్యదర్శి సాయి లక్ష్మి, శ్రీవారి మెట్టు వ్యాపారాల సంఘం నాయకులు చిట్టిబాబు, రెడ్డిప్రకాష్, లోకనాథం, రామ్మూర్తి, యుగంధర్, శ్రీనివాసులు, మొగులప్ప, రమాదేవి, చంద్రకళ, నందిని, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌పాయిజన్‌తో

'అపోలో' విద్యార్థులకు అస్వస్థత

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. మెడిసిన్, నర్సింగ్ చదువుతున్న విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ వల్ల అస్వస్థతకు గురికావడం పట్ల అపోలో యాజమాన్యం సమాధానం చెప్పాలని సిపిఎం, సిపిఐ నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఫుడ్‌పాయిజన్‌కు గల కారణాలను తెలియజేయడంతో పాటు, అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కోట్లాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న అపోలో యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు.

విద్యార్థినులను పరామర్శించిన డిఎంఅండ్‌హెచ్‌ఓ

ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అపోలో మెడికల్ కాలేజీ విద్యార్థులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతి దేవి పరామర్శించారు. ఫుడ్‌పాయిజన్ వల్ల 200 మంది అవస్థతకు గురికాగా 30 మంది విద్యార్థులు జ్వరం, విరోచనాలు, కడుపునొప్పికి గురికావడం జరిగిందన్నారు. వీరందరికీ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాల హాస్టల్‌ను తనిఖీ చేయడంతోపాటు రాపిడ్ రెస్పాన్స్ టీం ద్వారా సిచువేషన్‌ని మానిటర్ చేయనున్నట్లు తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు.

'అపోలో'యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరు అపోలో మెడికల్ కళాశాలలో ఫుడ్‌పాయిజన్‌తో 25 మంది విద్యార్థులు ఆస్పత్రుల్లో చికిత్స పొందడం బాధాకరమని వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. లక్షల ఖర్చు పెట్టి వైద్యవిద్య చదువుతున్న విద్యార్థులకు అనారోగ్యం పాలవడం దారుణమన్నారు. కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్న హాస్టల్లో నిరంతరం ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. పాడైన ఆహార పదార్థాలు, రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వాడడం వలన ఫుడ్ పాయిజన్‌గా మారి విద్యార్థులు అనారోగ్యబారిన పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు వ్యయ ప్రయాసలతో ఖర్చుపెట్టి బిడ్డలను చదివిస్తుంటే ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం ఏమిటంటే ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా యాజమాన్యాలు ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ ఉంటూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అస్వస్థకు గురైన వైద్య విద్యార్థులందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపైనే ఓపీ సేవలు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: కలకత్తాలో ట్రైనీ డాక్టర్ పై జరిగిన ఘటనకు నిరసనగా జూనియర్ డాక్టర్లు, తిరుపతి రుయా, స్విమ్స్ వద్ద విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం నిరసన దీక్ష శిబిరం వద్దనే, నడిరోడ్డుపై రోగులకు ఓపీ సేవలు అందించి, వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వైద్యులకు వైద్యవిద్యార్థులకు రక్షణ కల్పించేలా, సెంట్రల్ ప్రొడక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని, కోల్‌కత్తా కార్ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో జరిగిన ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ధీరజ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సంతోష్, డాక్టర్ రాజ్, డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ వెంకటేష్, వైద్యులు, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టు

నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : తిరుపతిలో రాజారెడ్డినగర్ కరకంబాడీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి గ్రాండ్ నిత్య అన్నప్రసాద ట్రస్ట్ నూతన భవన సముదాయంను శ్రీ శైవ క్షేత్రం కోటిలింగ తాళ్లయపాలెం పీఠాధీశ్వరులు శివస్వామి ప్రారంభించారు. శివస్వామి మాట్లాడుతూ ప్రతిఒక్కరు ధర్మాన్ని ఆచరించాలని దైవం పట్ల భక్తిశ్రద్ధలతో గౌరవంతో ఉండాలన్నారు. సేవాభావంతో చేసే ప్రతిపనికి దైవానుగ్రహం ఉంటుందని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు విట్టా సత్యనారాయణ, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, దేవకి వెంకటేశ్వరరావు, దిండుకుర్తి నరసింహులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో పనులలో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణల విషయాలు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, పిడి, నేషనల్ హైవే, ఎస్ఈ, నీటిపారుదల, డీఎఫ్ఓ, అడవులు శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సదరు అంశాలపై అధికారులు దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డీఎఫ్ఓ సతీష్, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, ఏపిఐఐసీ జోనల్ మేనేజర్ నెల్లూరు విజయ రత్నం, ఏపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖరయ్య, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈ మదన్ మోహన్, ఏపిఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం డిటి స్వామినాథన్ పాల్గొన్నారు.



మోడీని గద్దె దింపితేనే ప్రత్యేక హోదా

కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపితే తప్ప ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసీ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కేంద్రంలో కాంగ్రెస్‌ను గెలిపించడం అనివార్యమని స్పష్టం చేశారు. స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోంలో పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడుతో కలిసి తులసీ రెడ్డి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 70 రోజులు దాటాయనీ, సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్ పథకం అమలు హర్షణీయమే అయినా తక్కిన పథకాల సంగతేంటని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ముగిసిపోయే దశకు చేరుకున్నా ఇంకా పెట్టుబడి సాయం ఏమైందంటూ విమర్శలు చేశారు. నిరుద్యోగ భృతి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, 19–59 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు చేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. చేసేట్టుగా ఉంటే తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు స్పందించి సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంకటమునిని, రమణయ్య నాయుడు, వడివేలు, చిరంజీవులు, మోహన్, శివయ్య, రాఘవ రెడ్డి, నాగూర్ పాల్గొన్నారు.

తిరుపతి (మంగళం): రాష్ట్ర విభజన తర్వాత రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం విభజన చట్టంలో ప్రత్యేకమైన ప్యాకేజీలను కాంగ్రెస్ ఏర్పాటు చేసిందని, రాయలసీమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టిసారించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, వెంకట నరసింహులు, చిత్తూరు శివశంకర్, రామచంద్రయ్య, నరేంద్రబాబు, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

భారత్ బంద్ అంతంత మాత్రమే..

(మొదటి పేజీ తరువాయి)

వద్ద దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై, రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వినూత్న రీతిలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అన్నది న్యాయ సమ్మతం కాదని, కొంతమందికి మాత్రమే మేలు చేసే ఇలాంటి తీర్పును సుప్రీంకోర్టు ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పునర్ ఆలోచించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పరమశివం, ధన శేఖర్, ప్రసాద్ రావు, రాజేష్, రెడ్డప్ప, ఆనంద్, చిరంజీవి, గంగయ్య, సుబ్రహ్మణ్యం, మురళి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్ శ్రీకాళహస్తిలో బుధవారం విజయవంతంగా జరిగింది. బంద్ నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జై భీమ్ ఆర్మీ, అంబేద్కర్ మిషన్ ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమారు గంటపాటు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. విద్యార్థులతో కలిసి మానవహారం చేపట్టారు. పులి శ్రీకాంత్, కూలీ రవికుమార్, సైమన్ శ్రీనివాస్, పోతల చంద్ర, పెరిమిడి రఘు, బావులూరి అంకయ్య, అక్కుర్తి శివ పాల్గొన్నారు.

రామచంద్రపురం (చంద్రగిరి): భారత్ బంద్ సందర్భంగా చంద్రగిరి సీఐ ఎం.రామయ్య ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద, పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద పాకం, నరసింగాపురం రైల్వే స్టేషన్లలో బుధవారం ఉదయం 6 గంటల నుండి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరిలో అంబేద్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో దళితులు టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన తెలియజేశారు. వాహనాల రాకపోకలు, దుకాణాలలో వ్యాపారాలు యధావిధిగా కొనసాగాయి.

చిత్తూరు అర్బన్: భారత్ బంద్‌లో భాగంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాల మహానాడు కార్యకర్తలు, నాయకులు ఆధ్వర్యంలో చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో, చిత్తూరు ఆర్టీఓ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఆర్టికల్ 341కు వ్యతిరేకమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు లోకనాథం, రాసనపల్లి ప్రకాష్, వి.రాజ్‌కుమార్, కే.ధనంజయరావు. వి.దామోదరం, ఇరువారం డేవిడ్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: మాల మహానాడు నాయకులు చలపతిరావు, దొరబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు వెంకటేష్ ఆధ్వర్యంలో చింతమండి వద్ద చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారిపై చేపట్టిన నిరసనలో దళితులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ భగవతికి వినతిపత్రాన్ని అందించారు. సుందర్రాజ్, దినకర్, అమర్నాద్, కిరణ్, ఆశీర్వాదం, నాగరత్నం, ప్రవీణ్, మురగయ్య, చరణ్, రాము, వెంకటేష్, శివకుమార్, దొరబాబు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: పట్టణంలోని గడియారం స్తంభం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ వారు నినాదాలు చేశారు. మాల మహానాడు కన్వీనర్ చింతల చిరంజీవి, గొను శివకుమార్, అరవ పార్వతయ్య, కెఆర్.దాసరి, హరి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు వాసు సుబ్రహ్మణ్యం, యువత జగదీష్, నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

గంగాధరనెల్లూరు: భారత్ బంద్ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత యువకులు హరిబాబు, జగదీష్, గౌతమ్, వర, దాము, విష్ణు, సాయి, వంశీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

ఎస్ఆర్ పురం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు తీర్పును వెంటనే రద్దు చేయాలని ఎస్ఆర్ పురం దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఎంపీడీవో కార్యాలయం నుండి పుల్లూరు క్రాస్ వరకు ర్యాలీగా వచ్చి చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి పుల్లూరు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. దళిత నాయకులు కుప్పయ్య, జనార్దన్, ముత్యాలు, చిట్టి మహేష్, ఉమాపతి, బాబు, మార్కొండయ్య, రామకృష్ణ, తయ్యూరు బాబు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మాలమహానాడు మండల అధ్యక్షులు మంజునాథ్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల అర్పించి భారత్ బంద్‌ను శాంతియుతంగా పుంగనూరు– పలమనేరు జాతీయ రహదారిపై శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ప్రచార కార్యదర్శి తిప్పన్న, యూత్ లీడర్ వెంకటేష్, శివన్న, తోటి మునిరత్నం, నాగరాజ, రెడ్డప్ప బయప్ప పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు శంకరయ్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బంద్‌లో గురవమ్మ, శంకరయ్య, ఈశ్వరయ్య, మధు, హరి, జయ, నరేష్, రామయ్య, శివ పాల్గొన్నారు.

ఎస్ఐ విశ్వనాథనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల ఎస్ఐగా విశ్వనాథనాయుడు బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న వెంకట నరసింహ తిరుపతి ఎస్పీ విఆర్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. అక్కడి నుండి ఆయన స్థానంలో తిరుపతి ఎస్పి విఆర్ ఆఫీసులో పనిచేస్తున్న విశ్వనాథనాయుడును బుచ్చినాయుడు కండ్రిగ మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరికీ అందు బాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తూ గంజాయి, జూదం లాంటివి అరికడతామని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని తన విధులు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 23 వ తేదిన గూడూరు మండల పరిధిలోని 19 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు గూడూరు మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి కొత్త పనులు ప్రతి పాదనలు, ఉపాధి పను లకు వచ్చే కూలీల విధులు , హక్కుల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామసభల్లో పనులను ఆమోదించి తీర్మానం చేస్తామన్నారు. ఈ గ్రామ సభల్లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అభివృద్ధికి కలిసి పనిచేద్దాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండల అభివృద్ధికి అందరూ కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు నిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అరణియార్ ఆధునికీ కరణ పనులు, తుడా నిధులతో టూరిజం పనులు త్వరగా పూర్తి చేస్తామని, మండలంలో ఇల్లు లేని పేదలను గుర్తించి వారికి ఇంటి స్థలం కేటాయించాలని తహశీల్దారును కోరారు. మౌలిక వసతులు మెరుగుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రమేష్ బాబు, ఎంపీడీఓ రాధారాణి, జడ్పీటీసీ విష్ణు ప్రియ, వైస్ ఎంపీపీ విజయమ్మ, ఎ పిఎం వనిత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: అన్నదాతలు ఆశించిన ఆర్థిక లాభాల కోసం ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభ దాయకమని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం నుండి ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏవో శ్రీనివాస్ వివరించారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు,సాగు విధానంపై శిక్షణ తరగతి నిర్వహించారు. అవసరమైన సలహాలు, సూచనలు రైతు భరోసా కేంద్రంలో విఏఏ నుండి సమాచారం పొంద వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు హాజరయ్యారు.

రేపు ఉపాధి గ్రామ సభలు: ఎంపీడీవో

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని 44 గ్రామ పంచాయతీలలో ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలో ఉపాధి వేతనాలు కోరే హక్కు, అర్హతలపై అవగాహన, ఇప్పటికీ మంజూరై పురోగతిలో ఉన్న పనులు గురించి వివరించడం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్త పనులు కోసం ప్రతిపాదనలు, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై అవగాహన, లైన్ డిపార్ట్మెంట్ పనులను గ్రామ సభలో చేర్చడం, అమలు, గ్రామ పంచాయతీలో అయిన ఖర్చులు వినిపిస్తామన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో 2024 ఆగస్టు 12 నుండి 18 వరకు యాంటీ ర్యాగింగ్ మహోత్సవ్ 2024ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విభిన్న కార్యక్రమాలను ర్యాగింగ్ అనే భూతాన్ని తరిమి కొట్టడం, విద్యార్థుల్లో అవేర్నెస్ కలిగించేందుకు విశ్వవిద్యాలయం యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అందులో ప్రత్యేకించి ర్యాగింగ్ నివారణ నినాదాలు, వ్యాస రచన, పోస్టర్ తయారీ, లోగో తదితరాలు రూపకల్పన వంటి వివిధ పోటీలను విశ్వవిద్యాలయంలోని విద్యార్థులందరికీ నిర్వహించారు. ర్యాగింగ్ అత్యంత ప్రమాదకరమన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బాలికల సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని మండల తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో సాయి లహరి, మండల విద్యాశాఖ అధికారులు రవీంద్ర నాథ్, మునిసుబ్రహ్మణ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి దివాకర్ సమక్షంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంక్షేమశాఖ అధికారిణి సుభాషిణి ఆధ్వర్యంలో స్టోర్ రూమ్‌లో సరుకులు క్షుణ్ణంగా పరిశీలించారు. వంటగదిని పరిశీలించి గదిని, వంటపాత్రలు శుభ్రంగా వుంచుకోవాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని వాటిని వినియో గించుకోవాలన్నారు. తహశీల్దారు, ఎంపిడివో కార్యాలయ అధికారులను సమస్యలు తెలిపి తే పరిష్కారానికి సిద్ధంగా వున్నామని తెలిపారు. విద్యాశాఖ అధికారులు మాట్లాడు తూ తమ కార్యాలయంలోని ఒక టీవీ, చెత్తకు ఉపయోగపడే పరికరాలు అందిస్తా మని పేర్కొన్నారు. సిబ్బంది 24 గంటలు వసతి గృహంలోనే ఉండి విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకో వాలన్నారు. ఏదైనా సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తమకు తెలపాలని ఆదేశించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొ న్నారు.

రాత్రి వేళలో 'మహిళలకు ఉచిత ప్రయాణం'

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య ఒంటరిగా ఉన్న మహిళ ఇంటికి వెళ్లేందుకు వాహనం దొరకని వారు పోలీసు హెల్ప్‌లైన్ నెంబర్లు (1091, 7837018555) సంప్రదించి వాహనం కోసం అభ్యర్థించవచ్చని పోలీసులు ఉచిత ప్రయాణం కల్పిస్తారని పోలీసులు తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని బుధవారం పోలీసులు ప్రారంభించారు. వారు 24 గంటలు పని చేస్తారని, కంట్రోల్ రూమ్ వాహనం లేదా సమీపంలోని పిసిఆర్, ఎస్‌హెచ్‌వో వాహనం మహిళను సురక్షితంగా గమ్యస్థానానికి తీసుకెళతారని తెలిపారు. ఈ సందేశాన్ని మహిళలు అందరికీ తెలపాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు ఖాళీ సందేశం, మిస్డ్ కాల్ ఇస్తే పోలీసులు లొకేషన్‌ను కనుగొని సహాయం అందిస్తారని వివరించారు. భారత దేశం అంతటా ఈ సహాయం మహిళలకు వర్తిస్తుందని పోలీసులు తెలిపారు.

అనుమతులు లేని లే ఔట్లపై కఠిన చర్యలు: కమిషనర్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వం అనుమతి లేకుండా అనధికారకంగా ఏర్పాటు చేసిన లేఔట్లు వేసి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి తెలిపారు. తుడా, డిటిసిపి అనుమతి పొందకుండా ఏర్పాటు చేసిన సర్వే నెం.102/7పి, 108/ 8 ఎపి నంది మంగళం రెవెన్యూ గ్రామ విస్తీర్ణం ఎకరాలు 1.08 సెంట్లు , 59/11పి, 12, 17, 18 చెర్లోపల్లి రెవెన్యూ గ్రామం విస్తీర్ణము ఎకరాలు 0.85 సెంట్లలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ఎలాంటి ప్లాటు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయ వద్దని తెలిపారు. కొనుగోలు చేస్తే చట్ట విరుద్ధమని, ఈ ప్లాట్లుకు అమ్మకాలు, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిస్తామని, ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు కావని తెలిపారు. మౌలిక వసతులు రోడ్లు, కరెంటు, నీరు, కాలువ సదు పాయాలు కల్పన లేదని గమనించాలని కోరారు.

చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చెత్త సేకరణ, సంపదపై మూడు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీ లకు శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్, ఎంఓ టి సుధారాణి, ఈఓపిడి మాధురి ఆధ్వర్యంలో శిక్షణ సమావేశం నిర్వహించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా వడ మాల పేటలో చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించి వాటి వివరాలు ఉపయోగాలు, ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్వీయూ రూసా కో ఆర్డినేటర్ల నియామకం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రూసా కేంద్ర సమన్వయ కర్తలుగా ఆచార్య టి రమశ్రీ, డావి ఉషారెడ్డిలను నియమిస్తూ ఎస్వీయూ ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉత్తర్వులు అందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పిలుపు నిచ్చారు. బుధవారం వ్యవసాయ పరిశోధన స్థానం, పెరుమాళ్ళపల్లెలో పార్థీనియం కలుపు నివారణ వారోత్సవం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేసే శాస్త్రవేత్తలు, ఇతర ఆఫీసు సిబ్బది, టైంస్కేలు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ లేబరు కలసి చెరకు పరిశోధన పొలాల గట్లమీద, చెరకు పంట లలో వయ్యారి భామ కలుపు మొక్కలను తీసివేశారు.

గిరిజన కూలీల నిర్బంధంపై విచారణ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పెళ్లకూరు మండలం కానూరు రాజుపాలెంలో బుధవారం డీఎస్పీ విచారణ చేశారు. గత శుక్రవారం గిరిజనులపై రాజుపాలెం గ్రామానికి చెందిన ఓ ఇటుక బట్టి యజమాని ఎం రాజయ్య వెట్టి చాకిరీ చేయించడమే కాకుండా కులం పేరుతో దూషించడం ,మహిళలను వేధించడం, ఒకరి కాళ్లు చేతులు కట్టి ఇంటిలో నిర్బంధించడంపై పెళ్లకూరు మండలం పోలీస్ స్టేషన్‌లో ఆ గిరిజనులు కేసు పెట్టగా ఎస్సై శ్రీకాంత్ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో ఆ కేసు పై విచారణ చేపట్టారు, నాయుడుపేట డివిజన్ డిఎస్పి చెంచు బాబు విచారణ నిర్వహించారు . ఈ సందర్భంగా ఈయన వెంట పెళ్లకూరు మండలం ఆర్ ఐ సంతోష్ బాయ్ ,వీఆర్వో సుమతి , సిపిఎం నాయకులు శివకవి ముకుంద, ఎస్ఎఫ్ఐ మనోజ్ , స్వచ్ఛంద సంస్థలు జీవన జోల టి రమేష్, విఆర్ఏ భూపతి, స్థానికులు టి ఆనందు పాల్గొన్నారు.



గిరిజన కూలీలను విచారిస్తున్న డిస్‌పి

నేడు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గారి ఆధ్వర్యంలో గురువారం "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు ఉదయం10 నుంచి 11గంటల మధ్య 9849907885 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దష్టికి తీసుకురావచ్చని చెప్పారు.

కొత్తగా కౌన్సెలింగ్ నిర్వహించాలి

- డీఈవోకు యూటీఎఫ్ వినతి



డీఈవోకి వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో వర్క్ అడ్జస్ట్మెంట్ ఒక్కో మండలంలో ఒక్కో రకంగా ఉండడం వలన పారదర్శకత లోపించిందని యూటీఎఫ్ నాయకులు అన్నారు. కొత్తగా కౌన్సెలింగ్ చేపట్టాలని డీఈవోకి వినతి పత్రం అందించారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో చర్చించిన మినిట్స్, రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన గైడ్లెన్స్‌కు భిన్నంగా చిత్తూరు జిల్లాలో జరుగుతున్నట్లు చెప్పారు. మండలాల్లో ఉన్న సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను బలవంతంగా హైస్కూల్ లకు పంపిస్తున్నాన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన వర్క్ అడ్జస్ట్మెంట్ రద్దుచేసి తిరిగి కొత్తగా వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియ ప్రారంభించాలని డీఈవో దేవరాజులను కలిసి వివరించారు. అసంబద్ధంగా జరిగిన పని సర్దుబాటును రద్దుచేసి మండల స్థాయిలో పిల్లల సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా గౌరవధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, సహధ్యక్షులు ఎస్.రెహనా బేగం, జిల్లా కార్యదర్శులు ఏ.కృష్ణమూర్తి, రెడ్డెప్పనాయుడు, ఎస్పీ బాషా, పార్థ సారథి, ఎంవి రమణ, మధు, జ్యోతి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

- రూ.లక్ష మేర ఆస్తి నష్టం



నష్టపోయిన పంటను చూపుతున్న రైతు


ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని వంగంవారిపల్లి పంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి స్వైరవిహారం చేశాయి. వంగంవారిపల్లికి చెందిన రైతు దేవప్ప రెండు ఎకరాల్లో టమోటా సాగు చేశారు. మంగళవారం టమోటాలు కోసి బాక్కుల్లో పొలం వద్దనే భద్రపరిచారు. బుధవారం వేకువజామున మార్కెట్‌కు తీసుకువెళ్లాల్సి ఉండగా మంగళవారం రాత్రి ఆ పంట పొలం వద్దకు ఏనుగులు వచ్చాయి. బాక్కులు, టమోటాలను ధ్వంసం చేశాయి. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు ఏనుగుల దాడిలో చిందరవందరగా ఉన్న టమోటా బాక్కులను చూసి లబోదిబోమన్నారు. కష్టించి పండించిన పంటను చేతికందే సమయంలో గజరాజులు నాశనం చేయడంపై తీవ్ర ఆవేదనకు లోనైయ్యారు. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు దేవప్ప విలేకరులకు వివరించారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలని, పంటలపైకి ఏనుగులు రాకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి: చంద్రశేఖర్



ప్రజాశక్తి-పెద్దపంజాణి: సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పెద్దపంజాణి ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో ఓటు హక్కు ఉన్న రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకం జిరాక్సులతో ఈనెల 30వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలని స్థానిక సహకార సంఘంలో సీఈఓ చంద్రశేఖర్ కోరారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బిందు, తుంపర్ల సేద్య పరికరాలు పంపిణీకి సంబంధించి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరికరాల పంపిణీకి సంబందించి సంబంధిత అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్య సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని, జిల్లాకు 2024-25 సంవత్సరంలో 21వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించారని, ఇందులో ఇప్పటి వరకు 10వేల హెక్టార్లకు 9,169మంది రైతులు రిజిస్ట్రేషన్లు జరిగాయని మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రైతులకు అవగాహన కల్పించి రైతుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖలకు చెందిన నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు సమిష్టిగా వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకొని లక్ష్యాలను పూర్తి చేసేందుకు మరింత భాధ్యతతో పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పొటెన్షియల్ ఉన్న మండలాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదులో పంట సాగు చేస్తున్న రైతుల వివరాలను పక్కాగా నమోదు చెయ్యాలని ఏ పంట సాగు చేస్తున్నారో అనే విషయాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎటువంటి తప్పొప్పులకు తావు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,11,727ఎకరాలలో అన్ని పంటలకు చెందిన ఈ-క్రాప్ నమోదు పూర్తి అయినదని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభారాణి, ఎపిఎంఐపిపిడి బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సాంకేతికతతో వ్యవసాయంలో అధిక దిగుబడులు

రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ దివ్య



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేతలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: సాంకేతిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ దివ్య అన్నారు. బుధవారం మండలంలోని రాజుల కండ్రిగ, కృష్ణాపురం, ఆర్కేవీబీపేట గ్రామాల్లో రైతులకు డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయానికి ప్రధాన సమస్యగా ఉన్న కూలీల కొరతను అధిగ మించడానికి సాంకేతిక వ్యవసాయ పనిముట్లు ఎంతో దోహదపడుతుందన్నారు. పంటలను చీడ పీడల నుంచి రక్షించుకోవడానికి పిచికారీ చేసే మందులను కూలీలతో కాకుండా డ్రోన్ల వినియోగించడం వల్ల ఆతి తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణాకి పిచికారి చేయవచ్చని, దాని ద్వారా సమయం ఆదా అవడమే కాకుండా సరైన పద్ధతిలో మందులు పిచికారీ చేయవచ్చని సూచించారు. డ్రోన్ల ద్వారా 6 నుంచి 8నిమషాల్లో ఒక ఎకరా విస్తీర్ణానికి పిచికారీ చేసుకోవచ్చాన్నారు. పురుగుల మందు మోతాదు కూడా 20 నుండి 25శాతం తగ్గుతుందని, వీటి ప్రభావం వల్ల మామూలు పద్ధతి కన్నా అధికంగా ఉంటుందని, పంపపై భాగం నుంచి స్ప్రే చేయడం ద్వారా చెట్టు కాండం వరకు తడిచే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వేరుశెనగ పంటలకు డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేతలు రామకుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, రైతు సమైఖ్య అధ్యక్షులు నాగేశ్వరరాజు, ఏఈవొ గాయత్రి, కేవీకే సిబ్బంది, రైతులు పలువురు పాల్గొన్నారు.

బొమ్మల మాంత్రికుడు



- క్వాలిటీలో రాజీలేదు..
- భక్తులకు.. నాణ్యమైన వినాయకుని బొమ్మలు అందించడమే లక్ష్యంగా..
- కార్వేటినగరంలో పేరుగాంచిన బొమ్మల కుమార్

ప్రజాశక్తి-కార్వేటినగరం: అతనొక బొమ్మల మాంత్రికుడు.. అతని చేయి పడిందంటే ఎటువంటి నాణ్యత లేని బొమ్మనైన సుందరంగా తీర్చిదిద్దుతాడు. చూపురాలను సైతం ఇట్టే ఆకట్టుకుంటాడు. అతనికి లాభంతో పనిలేదు.. కొనుగోలదారుల నుంచి నమ్మకం పెరగడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. చిన్న వయస్సులో కాలంతో పోటీపడ్డాడు. మైండ్‌కి పదును పెట్టాడు. వినూత్నంగా ఆలోచించాడు.. కాలం పునాదులు వేసింది.. నిలబడ్డాడు. అతని నైపుణ్యాన్ని చేసే పనిని పదిమందికి తెలిపే ప్రయత్నంలో కథనం.. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం కొల్లగుంట పంచాయతీలో పవన్ కుమార్ ఆ గ్రామంలో సుమారుగా 20 సంవత్సరాల నుంచి వినాయక బొమ్మలను తయారుచేస్తున్నాడు. హోల్‌సేల్ దారులకు విక్రయిస్తుంటాడు. ఇతని చేతిలో బొమ్మ పడిందంటే అదిరిపోతుందని కొనుగోలదారులు అంటుంటారు. వినాయకుని బొమ్మలు వివిధ రూపాల్లో తయారుచేసి విక్రయిస్తుంటాడు. ఇతని దగ్గర 3అడుగుల నుంచి 16అడుగుల ఎత్తువరకు బొమ్మలను తయారు చేస్తాడు. సుమారుగా 150 బొమ్మలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి వాడే మెటీరియల్ మొత్తం క్వాలిటిగా ఉంటుందని అతను చెబుతున్నాడు. సంవత్సరం పొడవునా ఈ బొమ్మల తయారీలో నిమగ్నం అవుతాడు. ఇతని దగ్గర 5, 6 కుటుంబాల వారు పనిచేస్తుంటారు. వారికి అన్ని తానే చూసుకుంటాడు. అందువలనే చుట్టు గ్రామాలలో వినాయకుని బొమ్మలు తయారుచేసి బొమ్మల కుమార్‌గా పేరు ప్రసిద్ధిగాంచింది. దీనిబట్టి ఆలోచిస్తే అతను ఎంతలా క్వాలిటీలో రాజీ పోకుండా బొమ్మలు తయారు చేస్తాడు ఇటే అర్ధమవుతుంది. ఇతను తయారుచేసిన బొమ్మలను పక్క రాష్ట్రమైన బెంగుళూరు, తమిళనాడు రాష్ట్రాలలో నుంచి ఆంధ్రకు వచ్చి అధిక సంఖ్యలో బొమ్మలను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. అక్కడితో పోలిస్తే చానా తక్కువ ధరలకు బొమ్మలు వస్తాయని కొనుగోలుదారుల అభిప్రాయం. అందుకే ఆంధ్రకు వచ్చి పవన్ కుమార్ దగ్గర సంవత్సరం ముందుగా ఆర్డర్ పెట్టి కొనుగోలు చేసి మరీ తీసుకెళ్తారు. దీంతో అతని నైపుణ్యాన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సీజన్ ముగిసిన తర్వాత వచ్చిన కొద్దిపాటి ఆదాయం స్థానికులకు, కుటుంబ సభ్యులకు, వివిధ ధార్మిక కార్యక్రమాలకు





ఉపయోగిస్తూ సమాజసేవ చేస్తుంటాడు. పదిమందిలో గుర్తింపు పొందాడు.



క్వాలిటీలో రాజీలేదు..



బొమ్మల తయారీలో నాణ్యమైన మెటీరియల్‌ని ఉపయోగిస్తాను, పర్యావరణకు హాని చెయ్యని కెమికల్స్ను ఉపయోగిస్తాం. వినాయకుని బొమ్మల తయారీలో రాజీలేని పోరాటం ఉంటుంది.

- పవన్ కుమార్, కొల్లాగుంట గ్రామం, కార్వేటినగరం మండలం

హాస్టల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: హాస్టల్ విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బందులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్లదేనని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ బీసీ, ఎస్సీ వసతి గృహ సలహా సంఘం సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాస్టలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. నియోజకవర్గంలోని హాస్టళ్ళ వారీగా విద్యార్థుల సంఖ్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. పక్కాభవనాలు లేక ప్రైవేటు భవనాలలో హాస్టళ్ళను నడుపుతున్నామని కొత్త భవనాలను ఏర్పాటు చేయించాలని పలువురు వార్డన్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొత్త భవనాల



ఏర్పాటుతో పాటు హాస్టల్లో సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ రోజా, ఎంపీడీవో రాజేష్, ఎంఈఓ బాల సుందరం, అధికారులు జగ్గయ్య, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నిరసన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బుధవారం చిత్తూరు అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంజివరం సురేంద్రన్, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ సీఎం మహిళ అయినప్పటికీ ఒక మహిళ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కాపాడే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. సమస్యను పక్కదారి పట్టించడానికి ఆందోళన కార్యక్రమం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పటికీ నిందితులను అరెస్టు చేసి శిక్షించడానికి ఎంత సమయం పడుతుందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కూడా మీనమేషాలు వేస్తున్నదని, వైద్యులపై దౌర్జన్యం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించడానికి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రిపై వందలాదిమంది దాడి చేస్తుంటే అధికార పార్టీ అక్కడ పోలీస్ యంత్రాంగం ఏం చేస్తున్నదని సుప్రీంకోర్టు ప్రశ్నిస్తున్నా వారికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. వైద్యురాలు అత్యాచార హత్యపై సుప్రీంకోర్టు స్పందించిన తీరు అభినందనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కఠిన మైన చట్టాలు తీసుకొచ్చి మహిళలపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్య దాస్, బాలసుబ్రమణ్యం, దాములతోపాటు మహిళలు పాల్గొన్నారు.

రేపు మండల మీట్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘువేంద్ర రాజు తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అన్ని అధికారులు తమ శాఖాపరమైన అజెండాలతో సమావేశానికి రావాలని ఆదేశించారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ఏఎం పురం పంచాయతీ రాఘవరాజపురంలో గ్యాస్ లీకై అంగన్వాడీ టీచర్ రెడ్డెమ్మ ఇల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఇంట్లోని వస్తువులు, దుస్తులు, డబ్బులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. దీంతో రెడ్డెమ్మకు తోటి అంగన్వాడీ టీచర్లు బుధవారం దుస్తులు, ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఐసిడిసి కార్వేటినగరం ప్రాజెక్ట్ కోశాధికారి విజయ, పద్మ, చంద్రిక, రత్నమ్మ, ఝాన్సీ, మార్తా, చిన్ని, భాగ్య, సుమతి కళావతి కొత్తపల్లి సెక్టార్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని అగస్త్రి జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో పలువురు విద్యార్థులు గెలుపొందారు. బుధవారం విజేతలకు యువ భారత్ అసోసియేషన్, ఎన్వైకెఎస్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వేకాంత్, కార్యదర్శి గణేష్, జాయింట్ సెక్రటరీ గోవిందప్ప, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పంచాయతీల్లో గ్రామ సభలు

ప్రజాశక్తి-గంగవరం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంకి సంబంధించి శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మధుసుదన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పనుల గుర్తింపు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 16 పంచాయతీల్లో నిర్వహించ తలపెట్టిన ఈ సభల్లో 18ఏళ్లు నిండిన వారు పాల్గొనాలని కోరారు.

సోమల: మండలంలోని అన్ని పంచాయతీలలో ఈనెల 23వ తేదీన ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పంచాయతీల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న ఎంఇఒ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఎస్.నడింపల్లి పంచాయతీ కరకమంద ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ శివరత్నమ్మ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించి వారికి ప్రశ్నలు సంధించి వారి వద్ద నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం అందిస్తాం

◆ ఆర్డీవో మనోజ్ కుమార్ రెడ్డి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారాన్ని అందిస్తామని పలమనేరు ఆర్డీవో మనోజ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం బంగారుపాళ్యం తహశీల్దార్ కార్యాలయంలో ఎక్స్ప్రెస్ హైవే భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారుల భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందిస్తామని రైతులు ఇందుకు ప్రభుత్వానికి సహకారం అందించాలని ప్రభుత్వం భూమికి సంబంధించిన నష్టపరిహారాన్ని నిర్ధారించిందని ఆ ప్రకారమే ప్రతి రైతుకు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, సర్వేయర్ లావణ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోకి అర్బన్ హెల్త్ సెంటర్‌ను డిఎంహెచ్ఒ ప్రభావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. సిబ్బంది హాజరు పట్టి, బయోమెట్రిక్ అటెండెన్స్, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, గర్భిణీ స్త్రీల నమోదు, రక్తహీనతతో ఉన్న గర్భిణీల నమోదు, రక్త పరీక్షల రిపోర్టులు, మందుల నిల్వ తదితర రిపోర్టులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అడల్ట్ బిసిజి వాక్సినేషన్‌పై ఉదయం పూట ప్రజలు అందుబాటులో ఉంటారని, ఏడు గంటల నుంచి 9గంటల లోపల వాక్సినేషన్ ఎలిజిబుల్ ఉన్న వారందరికీ వాక్సినేషన్ వేసి అప్లోడ్ చేయాలన్నారు. సీజనల్ వ్యాదులపై స్టాఫ్ డయేరియా, దోమకాటు ద్వారా వచ్చే డెంగీ, మలేరియాపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వందశాతం పూర్తిగా అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్స్, స్టాఫ్ పాల్గొన్నారు.

పెండింగ్ ఇంటి నిర్మాణాల పూర్తికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:
జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం కింద మంజూరైన ఇండ్లలో స్టేజ్ కన్వర్షన్ ఖచ్చితంగా జరగాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గృహ నిర్మాణశాఖ అధికారులు ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఇండ్ల పురోగతిపై గృహ నిర్మాణశాఖ పీడీ, ఈఈ, డిఈ, ఎఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం క్రింద మంజూరైన గృహాల పూర్తికి సంబంధించి స్టేజ్ కన్వర్షన్ జరగాలని లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణానికి సంబందించిన ఆర్థిక సాయాన్ని సంఘాల ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సి, ఎస్టి, పేదలకు ఇండ్లు మంజూరయినప్పటికి ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న కారణంగా ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడం ప్రధాన కారణంగా ఉంటుందని, క్షేత్రస్థాయి ఎంపిడిఓలు, గృహనిర్మాణ శాఖ అధికారులు పర్యటించి లబ్ధిదారుల వారీగా వారి సమస్యలను గుర్తించి అందుకు చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా గృహ నిర్మాణాల పురోగతికి అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా అధికారులు పని చేయాలన్నారు. బిల్లులు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఎక్స్పెండీచర్ బుకింగ్ కచ్చితంగా జరగాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్‌తో అనుసందానంతో పని దినాలను కల్పించి ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని క్షేత్ర స్థాయిలో ఇసుకకు సంబందించి ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడమే లక్ష్యం



ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని జిల్లా సైన్స్ అధికారి ఆర్వి రమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో నియోజకవర్గంలోని ఇన్స్పైయర్ గైడ్ టీచర్లకు మనక్ నామినేషన్లు 2024-25పై శిక్షణ కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులో మదిలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిల్లలను ఆవిష్కరణ వైపుగా నడిపించేందుకు ఈ శిక్షణా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఇన్స్పైర్ మనక్ అవార్డులకు ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు చేసుకోవాలని ప్రతి ఒక్కరూ ఇన్స్పైయర్లో భాగస్వాములు కావాలన్నారు. సెప్టెంబర్ 15 లోపు https//www.inspireawards-dst.gov.in వెబ్సైట్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు విజయకుమార్, మనోజ్ కుమార్, డైట్ ఆధ్యాకులు తిరుమలరాజు, బెంగళ్రాజు, ఆర్పీలు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా



ప్రజాశక్తి-కార్వేటినగరం: అక్రమ రవాణ, వ్యాపారాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదం మోపతామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం కార్వేటినగరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో తిరుపతి సీఐడీ విభాగం ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీలో కార్వేటినగరంకి వచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-సోమల: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ అసోసియేషన్ పోటీలకు ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఎంపికైయ్యారు. సోమల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి విద్యార్థుల ఎంపిక పోటీలను అసోసియేషన్ సెక్రటరీ చిన్నప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. వంద మంది విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పాల్గొనగా వీరిలో 8మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని చిన్నప్ప తెలిపారు. వారు సెప్టెంబర్ 14, 15, 16 తేదీలలో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటారని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరుణానిధి తెలిపారు. బాలికల విభాగంలో ఐశ్వర్య, భార్గవి సోమల నుంచి గాయత్రి, చార్మి, ఎస్ఆర్‌పురం మండలం చిల్లమాకులపల్లి నుంచి ఎంపికయ్యారని, అదేవిధంగా బాలుర విభాగంలో మహమ్మద్ అఫ్రోజ్, సుజైన్ సోమల నుంచి శివ ప్రసాద్, చౌడేపల్లి విజయవాణి నుంచి సుదీప్, పీలేరు మండలం కోటపల్లి నుంచి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు గోవర్ధన్, సహదేవ నాయక్, నాగ ముని క్రోష్ణ, నూర్జహాన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు హేమలత మాట్లాడుతూ 78మంది స్థానికులు వివిధ ఆరోగ్య సమస్యలపై శిబిరం వద్దకు వచ్చారని వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పవిత్ర, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారి పల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో కొంతకాలంగా దారి సమస్య ఏర్పడింది. అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి దారిని ఆక్రమించుకోవడంతో స్థానికులు తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌ను ఆశ్రయించారు. బుధవారం కాలనీ వద్దకు చేరుకొని విచారణ చేపట్టిన తహశీల్దార్ దారి స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. ఆక్రమిత దారిని జేసీబీతో మూసేయించి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, మండల సర్వేయర్ లావణ్య, వీఆర్వో రామకృష్ణయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-విజయపురం: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చునని డాక్టర్ విష్ణుప్రియ సూచించారు. బుధవారం మండలంలోని మిట్టూరులో ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి సహకరిస్తాం

◆ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి-కుప్పం రూరల్: మండలంలోని పెద్దబంగారునత్తం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ధర్మరాజుల ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఆయన ఆలయ నిర్మాణ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందేలా చర్యలు చేపడతామన్నారు.

అవినీతి చర్యలకు పాల్పడుతున్న సిబ్బందిపై వేటు: ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తీవ్రమైన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరిపి వెంకటగిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను డి రమణ పీసీ- 165, కె . మస్తాన్ పీసీ- 1887ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు బుధవారం అదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు తమదైన శైలిలో అవినీతికి పాల్పడుతూ, స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం చేయకపోగా.. వారి బాధలను వీరికి అవసరాలుగా మలుచుకొని, యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడినట్టు, గతంలో కూడా వీరిద్దరిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నట్లు, దర్యాప్తుల్లో తేలిందని ఎస్‌పి పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం హోంగార్డు చిన్న తంబి శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ, ప్రైవేట్ ట్రావెల్స్ నుండి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నాడు. దీనిపై క్రమశిక్షణ చర్యలో భాగంగా బదిలీపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. ఇక్కడ కూడా అదే తంతు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తన ప్రవృత్తిని కొనసాగించాడని దర్యాప్తులో తెలిసింది. దుష్ప్రవర్తన, అవినీతికి సంబంధించిన బలవంతపు వసూళ్లకు పాల్పడిన హోం గార్డ్ పై కఠిన చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు. పోలీస్ శాఖ సమగ్రత చాలా ముఖ్యమైందని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఏ ప్రవర్తన అయినా చాలా తీవ్రంగా పరిగణిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ సమగ్రత, వృత్తి నైపుణ్యం, అత్యున్నత ప్రమాణాలను పాటించాలని, అవినీతికి పల్పడకూడదని ఎస్పీ సూచించారు. 'అవినీతిని, అక్రమ వసూళ్లు, నెల మామూళ్ల ను సహించేది లేదు" ఏ స్థాయి అధికారి అయిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని, ఈ సస్పెన్షన్ ఒక్కటే కాదని అవసరమైతే ఇంకా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో రూ.1.60 లక్షల జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో 16 మందికి 1లక్ష60వేల రూపాయలు జరిమానా విధిస్తూ 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి గ్రంధి శ్రీనివాస్ తీర్పు ఇచ్చారు. ఇందులో పదేపదే డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన ముగ్గురికి జరిమానా తో పాటు జైలు శిక్ష విధించారు. లక్ష్మిపురానికి చెందిన కార్ డ్రైవర్ బి . సురేష్ కు నాలుగు రోజులు జైలు శిక్ష. చెర్లోపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సి.శివకి మూడు రోజులు జైలు శిక్ష. చిత్తూరు జిల్లా సదుంకు చెందిన ఆటో డ్రైవర్ కె.సునీల్ రెండు రోజులు జైలు శిక్ష విధించారు. వీరితో పాటు రోడ్డుపైన వాహనదారులకు, పాదచారులకు, ఇబ్బంది కలుగజేసే, రోడ్డుకి ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న 60 మంది పై బిఎన్ ఎస్ ఎస్ ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టు హాజరు పరిచారు. ఒక్కొక్కరికి 500 రూపాయలు చొప్పున మొత్తము రూ.30వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ కోర్ట్ ఇన్‌ఛార్జి మూడవ అదనపు జ్యుడీషియల్ సివిల్ జడ్జి జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.



రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - తడ: పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. తడ ఎస్‌ఐ నరసింహారావు కథనం మేరకు..తడ మండలం లోని అక్కంపేట వద్ద ముందస్తు సమాచారంతో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కారిపాకం అండగుండాల నుండి హైవే మీదకు వచ్చిన వాహనాన్ని తనిఖీ చేయగా 60 బస్తాల రేషన్ బియ్యంను గుర్తించి వాటిని స్వాధీన పరచుకుని సంబంధిత అధికారులకు సమాచారం తెలిపి అనంతరం గోదాముకు తరలించారు. బియ్యం 2970 కేజీలు వున్నట్లు వాటి విలువ 1లక్షా9వేల8వందల 70 రూపాయలుగా తెలిపారు.

వృద్ధాశ్రమంలో పండ్లు, స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రజా సాధికారిక ట్రస్ట్ ఆధ్వర్యం లో లక్ష్మీనరసింహ ఛారిటబుల్ ట్రస్ట్ వికృతమాల వృద్ధుల ఆశ్రమం లో పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ప్రసిడెంట్ బాలాజీ నాయక్, కోఆర్డినేటర్లు చంద్రశేఖ ర్, నారాయణరెడ్డి, సురేష్, పల్లవి, శారద, పాల్గొని వృద్ధులకు అండగా ఉంటామని వృద్ధుల సంక్షేమ కార్యక్రమాలకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సైదమ్మ సభ్యులు వృద్ధులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.

ఎస్ఐకి సన్మానం..వీడ్కోలు

ప్రజాశక్తి -రామచంద్రపురం : మండల ఎస్ఐగా పనిచేస్తూ చిత్తూరు జిల్లా తవణంపల్లి పోలీస్ స్టేషన్కు బదిలీ అయిన ఎస్ఐ చిరంజీవికి బుధవారం వీడ్కోలు సన్మానాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్సిపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సార్వత్రిక ఎన్నికల బదిలీలలో ఫిబ్రవరి ఒకటో తేదీ విధుల్లో చేరారు. ఈ ఏడు నెలల కాలంలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు.. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు జవాబుదారి తనంతో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నా రు. పోలీస్ స్టేషన్ సిబ్బంది దుశ్శాలువతో, గజ పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శేఖర్, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మదన్మోహన్, హెడ్ కానిస్టేబుల్ లు యోబు, రమణయ్య, పరమేశ్వర్ రెడ్డి రైటర్ సురేష్, త్యాగరాజులు, ధనుంజయులు, రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, పాల్గొన్నారు.

'మా ఆతిథ్యం' రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ, పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని 'మా ఆతిథ్యం' రెస్టారెంట్ ను బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం రెస్టారెంట్లో రిబ్బన్ కట్ చేసి రెస్టారెంటును ప్రారంభించారు.ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులు ఎమ్మెల్యేకి శాలువా కప్పి గజమాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. వ్యాపారం అభివృద్ధి చెందాలని మొదట ఎమ్మెల్యే బోని చేశారు. వ్యాపారం దినదిన అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవంలో కూటమి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : కోలాకత్తా లో పీజీ వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను వ్యతిరేకిస్తూ జనసేన నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ ర్యాలీ కృష్ణాపురంఠాణా నుంచి నాలుగుకాళ్ళ మండపం వరకు సాగింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో సాగిన ర్యాలీలో జనసేన నాయకులు ఆరణి శివ, ఆరణి మదన్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి,డాక్టర్ వనజ, బాబ్జీ, ఆముదాల వెంకటేష్ రాయల్, హరిశంకర్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సమస్యను పరిష్కరించండి

ఎమ్మెల్యేకు భవన నిర్మాణ సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ పరిధిలో ఉచిత ఇసుక సమస్యను పరిష్కరించాలని భవన నిర్మాణ సంఘ నాయకులు, కార్మికులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను బుధవారం కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గూడూరు ఆర్‌డివోకు, మరొక దఫా తహశీల్దారును కలిశామని, ఉచిత ఇసుక విషయమై వారు పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తుండడంతో ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ని, భవన నిర్మాణ సంఘం (సిఐటియు) నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కలిశారని తెలిపారు. భవన నిర్మాణ సంఘంలో వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులు ఇసుక కొరతతో పనులు లేక ఇబ్బందులు పడుతూ వారి కుటుంబాలు పస్తులతో వుంటున్నాయన్నారు. నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఉచిత ఇసుక విషయంపై వినతి పత్రం సమర్పించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లా అధికా రులతో మాట్లాడి త్వరలో ఉచిత ఇసుకను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు, రఫీ, సేలం సేకరాచారి, జిలాని బాయ్, అబ్దుల్లా, భవన నిర్మాణ వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, గూడూరు శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, ఎస్ సురేష్, అడపాల ప్రసాద్, బి చంద్రయ్య పాల్గొన్నారు.

ఏపీ హౌసింగ్ కాలనీలో అవినీతిని వెలికితీయాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఏపీ హౌసింగ్ కాలనీలో చోటు చేసుకున్న అవినీతిని గుర్తించి వెలికి తీయాలని, పట్టాలు పొందిన బినామీలను గుర్తించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని తొండవాడ హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఏపీ హౌసింగ్ కాలనీ లో అధికారులతో ఎంఎల్‌ఏ పులివర్తి నాని సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రజల వద్ద ఎంఎల్‌ఏ నాని వినతులు స్వీకరించారు. తొందవాడ హౌసింగ్ కాలనీ లో చంద్రగిరి,తిరుపతి రూరల్ మండలాలకు సంబంధించిన వారికి మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేశారో వివరాలు ఇవ్వాలన్నారు. హౌసింగ్ కాలనీలో వీధి లైట్లు, డ్రైనేజీ, రోడ్,నీటి సమస్యలు ఎంఎల్‌ఏకు స్థానికులు వివరించారు. బినామీల పేర్లతో వున్న ఇండ్లను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ పేద ప్రజలకు ఇండ్లు ఇమ్మని చెప్పినా, అధికారుల తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారకపోవడం సరికాదన్నారు. అనంతరం ఎంఎల్‌ఏ పులివర్తి నాని అధికారులతో కలిసి హౌసింగ్ కాలనీని పరిశీలించారు. ఇప్పటివరకు జియో ట్యాగ్ చేయని వారికి ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి హక్కుదారుల వివరాలు అడిగి తెలుసుకుని దగ్గరుండి జియో ట్యాగ్ చేయించారు. త్వరగా పనులు చేపట్టాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ముడిపల్లి సురేష్ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, ఈశ్వర్ రెడ్డి, ఆర్ మునిరత్నం రాయల్ పాల్గొన్నారు.

అభివృద్ధిని వేగవంతం చేస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరికీ 'అందుబాటులో ఉంటూ అభివృద్ధిని వేగవంతం చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. తిరుపతి రూరల్ మండలం వేదాంత పురంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పాలనలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండు నెలలలో చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకునేందుకు అడ్డంకులు సృష్టించి, కుయుక్తులు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో రహదారులు, స్వర్ణముఖిపై వంతెనల నిర్మాణం, సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి సీఎం చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సహకారంతో నిధులు మంజూరు చేసుకోవడం ఆనందంగా వుందన్నారు. టిడిపి విజయానికి కృషి చేసిన ప్రతి కార్య కర్తకూ గుర్తింపు వుంటుందన్నారు. తన అభివృద్ధిని నమ్మి తన వెంట నడిచేందుకు ముందుకు వచ్చిన మాజీ సర్పంచ్ తోట చిరంజీవి రెడ్డి, వార్డ్ మెంబర్ ముదిరాజ్ చంద్రాలకు, గ్రామ ప్రజలకు అండగా ఉంటా నని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఏ ఈశ్వర్ రెడ్డి, అవిలాల సుధాకర్, కృష్ణమూర్తి రెడ్డి, శ్రీనివాసులు శ్రీధర్ నాయుడు, లక్ష్మీ ప్రసాద్, చెరుకుల పరంధామ యాదవ్, కుమార్ స్వామి, శ్యాం బాబు, ఢిల్లీ యాదవ్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

గత పదేళ్ల గా వైసీపీలో ఉంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విజయానికి కృషి చేసినా ఆయన స్వార్థ రాజకీయాలకు బలై చెవిరెడ్డి చెర నుండి బయటపడ్డామని ఇక ఎమ్మెల్యే పులివర్తి నాని వెంట నడుస్తామని వేదాంతపురం మాజీ సర్పంచ్ తోట చిరంజీవి రెడ్డి, మాజీ వార్డు సభ్యులు ముదిరాజ్ చంద్రాలు పేర్కొన్నారు. వారు తమ అనుచరులతో బుధవారం టిడిపిలో చేరారు. వారికి పులివర్తి నాని టిడిపి కండువా కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలికి, కార్యకర్తలకు మంచి గుర్తింపునిస్తూ ప్రజలకు ఎమ్మెల్యే పులివర్తి నాని సుపరిపాలనకు కృషి చేస్తున్నారన్నారు. ఆయన అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చొరవను ఆదర్శంగా తీసుకొని ఆయన వెంట నడిచేందుకు ముందుకొచ్చామని మాజీ వార్డు సభ్యులు ముదిరాజ్ చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులివర్తి నానికి దుశ్శాలువా, గజ పూల మాలలతో ఘనంగా సత్కరించారు. స్థానికులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



చిరంజీవి రెడ్డికి కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాని

పంచాయతీలకు నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గ్రామ పంచాయతీలకు రూ.998 కోట్లు నిధులు కేటాయిస్తూ సిఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకొన్న గంటల వ్యవధిలోనే సర్పంచుల ఖాతాల్లోకి చేర్చడంపై రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఛైర్మన్ యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు రావలసిన 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను రూ.10,600 కోట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దారి మళ్లించి తన సొంత అవసరాలకు వినియోగించారని ఆరోపించారు. సర్పంచుల అకౌంట్లు నుండి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా దొంగలించారన్నారు. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేసి నిధులను తిరిగి సర్పంచుల అకౌంట్లోకి జమ చేయాలని 16 డిమాండ్లను చేశామన్నారు. గౌరవ వేతనాలు పెంచాలని, ముగ్గురు పిల్లలు ఉన్నా సర్పంచ్ పదవికి పోటీ చేయడంపై, ఉపాధి హామీ నిధులను జగన్ మోహన్ రెడ్డి దారి మళ్లించారన్నారు. మంగళవారం అమరావతి కేంద్రంగా పంచాయతీ రాజ్ శాఖపై సమీక్ష నిర్వహించి పలు నిర్ణయాలను తీసుకున్నారన్నారు. ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ గ్రామ పంచాయతీలలో నిర్వహించే గ్రామ సభల్లో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు తీర్మాణాలు చేస్తే ఉపాధి హామీ నిధుల నుండి మొదటి విడతగా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ట్యాంకుల నిర్మాణం చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడటంపై అనేక పోరాటాలను గత ప్రభుత్వంలో చేయాల్సివచ్చిందన్నారు. ఆనాడు ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబు ఇచ్చిన హామీలను నెవఉందన్నారు. మిగిలిన డిమాండ్లను త్వరలోనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, ప్రశాంత్రెడ్డి, చుక్కా ధనంజయ యాదవ్, మురళి, మునిరెడ్డి, నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు రాజేంద్రప్రసాద్

ప్రకృతి వ్యవసాయంతో భూములకు జీవం

ప్రజాశక్తి-వెంకటగిరి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రసాయనాలతో నిర్జీవమైన సాగుభూములకు జీవంపోయవచ్చునని తిరుపతిజిల్లా వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య తెలిపారు. పెరియవరం కృషివిజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయపై ఏర్పాటు చేసిన రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. సాగుభూములకు అవసరానికి మించి కలుపుమందులు, గుళికల పురుగుమందులు, రసాయన ఎరువులు వాడకం వలన భూమిలోని మేలు చేసే సూక్ష్మ జీవులన్నీ అంతరించి పోయాయని ఆయన తెలిపారు. స్థానికంగా దొరికే సేంద్రీయ వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కెవికె అధిపతి గోవిందరాజులు, శాస్త్రవేత్తలు నాగార్జున్‌రెడ్డి, రాజీవన్, తిరుపాల్, విజయశ్రీ, జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



నీటిని పొదుపుగా వినియోగించాలి: టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఇప్పటి వరకు కురిసిన తక్కువ వర్షపాతం కారణంగా తిరుమలలోని స్థానికులు, యాత్రికుల నీటి అవసరాలను తీర్చడానికి, తిరుమలలోని ఐదు ప్రధాన డ్యామ్‌లలో లభ్యమయ్యే నీరు రాబోయే 120, 130 రోజుల అవసరాలకు మాత్రమే సరిపోతుందని టిటిడి ఒక ప్రకటనలో పేర్కొంది. తిరుమలలో ప్రతి రోజూ దాదాపు 43 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తున్నారని, అందులో 18 లక్షల గ్యాలన్లు తిరుమల డ్యామ్‌ల నుండి మిగిలిన నీరు తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ నుండి సేకరిస్తున్నామని తిరుమల లోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, పసుపుధార డ్యామ్‌ల మొత్తం నిల్వ సామర్థ్యం 14,304 లక్షల గ్యాలన్లు కాగా, ప్రస్తుతం తిరుమలలో 5,800 లక్షల గ్యాలన్ల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. అక్టోబరు 4వ తేదీ నుంచి 12 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలను సందర్శించే వేలాది మంది భక్తుల ప్రయోజనాల దృష్ట్యా, నీటి వృథాను అరికట్టాలని, నీటి వినియోగాన్ని నియంత్రిం చేందుకు కొన్ని చర్యలు తీసుకోవాలని టిటిడి నిర్ణ యించి భక్తులతో పాటు స్థానికులకు విజ్ఞప్తి చేసింది.

భక్తుల ఆరోగ్య భద్రత టిటిడి కర్తవ్యం: అదనపు ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతే టిటిడి అత్యంత ప్రాధాన్యత అని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. టిటిడి ఈవో జె శ్యామల రావు ఆదేశాల మేరకు టిటిడి ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమల లోని హోటళ్ల నిర్వాహకులకు, యజమా నులకు తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ సత్సంగం హాల్లో బుధవారం నిర్వహిం చిన శిక్షణలో అదనపు ఈవో మాట్లాడుతూ అన్ని రకాల తిను బండారాలు, ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణా లను పాటించాలన్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే వేలాది మంది భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం హోటళ్లను నిర్వహించాల న్నారు. హోటళ్ల లోపల పరిశుభ్రత, ఆహార పదార్థాలు నిల్వ చేయడం, వడ్డించడం వంటి విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించి క్రమబద్ధీ కరించడం, తదితర విషయాలను నిశితంగా పరిశీలించాలని ఆయన హోటళ్ల వారిని ఆదేశించారు. న్యూ ఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ సిహెచ్ ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అన్ని రెస్టారెంట్‌లు, తినుబండా రాలలో అనుసరించా ల్సిన పరిశుభ్రత, పారిశుధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక, రసాయన, జీవ ప్రమాదాలు, వృథా వంటి వాటి గురించి వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీసు కునే చర్యలను వివరించారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, తిరుమల హెల్త్ ఆఫీసర్ మధుసూధన్ రావు పాల్గొన్నారు.

ఉద్యానవన సుందరీకరణ పనులు ప్రారంభం


ఉద్యానవన సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు ఉద్యానవనాన్ని మరింత సుందరీకరించడానికి తుడా అధికారులు స్పందించారు. గతంలో వారపు సంత స్థలానికి పక్కనే ఉపాధి పథకంలో మంజూరైన నిధులతో మినీ పార్క్ నిర్మించారు. అయితే పార్కు పనులు పూర్తయిన తర్వాత దీన్ని ప్రారంభించడానికి అప్పటి ప్రజా ప్రతినిధులు చొరవ చూపలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే పార్కు విస్తరణ అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని తుడ పాలక మండలకి ఎమ్మెల్యే ఆదిమూలం ఇటీవల వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో గతవారం తుడా వైస్‌ఛైర్మన్ ఎమ్మెల్యేతో కలిసి ఉద్యాన వనాన్ని పరిశీలించారు. దీంతో బుధవారం తుడా ఉపాధ్యక్షులు వెంకట నారాయణ చొరవతో ఉద్యానవన అధికారిణి మాలతి, సహాయ ఉద్యానవన అధికారి సుబ్రహ్మణ్యం సత్యవేడు మినీపార్క్ వద్దకు చేరుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మంజుల రమేష్, పంచాయతీ సెక్రెటరీ ముని రవికుమార్ పర్యవేక్షణలో ఉద్యానవనంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపును చేపట్టారు. ప్రోక్లైన్ సాయంతో పిచ్చి మొక్కలు తొలగిస్తున్నారు. మొక్కలు తొలగింపు తర్వాత పూర్తి స్థాయిలో సర్వే చేసి సుందరీకరణ పనులు చేపట్ట నున్నారు. ఉద్యానవన అధికారి ణి మాట్లా డుతూ ఎమ్మెల్యే వినతి మేరకు తుడా ఉపాధ్యక్షులు వెంకటనారాయణ ప్రత్యేక చొరవ తో ఉద్యానవన పనులు చేపడు తున్నామని తెలిపారు. ఉద్యానవన పనులను త్వరితగతిన పూర్తిచేసి సత్యవేడు పట్టణ ప్రజల కు ఆహ్లాదకర వాతావరణం అందిం చాలని తుడా ఉపాధ్యక్షులు తమకు సూచించి నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ అయ్యప్ప, పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తిరుమలకు చిరంజీవి


తిరుమలకు చేరుకున్న చిరంజీవి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారి దర్శ నా ర్థం తిరుమ లకు చేరుకు న్న ప్రముఖ హీరో చిరంజీవి కి ఫినిక్స్ గెస్ట్ హౌస్ వద్ద టీటీడీ , పోలీసు అధికారులు స్వాగతం పలికారు. 69వ జన్మదినం సందర్భంగా గురువారం కుటుంబ సభ్యు లతో కలిసి చిరంజీవి శ్రీవారిని దర్శించుకో నున్నారు.

చిరంజీవికి సత్కారం

తిరుపతి(మంగళం): నటుడు కొణిదెల చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా రేణిగుంట విమానాశ్ర యానికి చేరుకున్న ఆయనను జనసే న ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షు లు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.

అలిపిరి సిఐ రామ్ కిషోర్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అలిపిరి సిఐగా రామ్ కిషోర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నిర్వహిం చిన బదిలీల్లో భాగంగా అలిపిరి సిఐగా ఆయన బదిలీపై వచ్చిన విషయం విదితమే. రామ్ కిషోర్ గతంలో ఈస్ట్ సీఐగా పని చేశారు. ఆ తర్వాత సిఐడి సీఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం అలిపిరి సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తిరుపతిలో పని చేసిన అనుభవం రీత్యా ఇక్కడ పరిస్థితులు తనకు బాగా తెలుసని, తన పరిధిలో శాంతి భద్రతలను అదుపులో ఉంచి, ప్రజా రక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు ఆయనని అభినందించారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-డక్కిలి: పంటలకు చీడపీడలు ఆశించిన తర్వాత మందులు పిచికారీ చేయడం కంటే ముందుగానే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు రావడమే కాక రైతులు సాగువ్యయం తగ్గి లాబాలబాట పడుతారని తిరుపతి జిల్లా వ్యవశాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. డక్కిలి మండలం తీర్థంపాడు గ్రామంలో బుధవారం ఉద్యాన శాఖ అధ్వర్యంలో రైతులకు శిక్షణ నిర్వహిం చారు.

అంగన్‌వాడీలు గ్రామాల్లో ఉండి సేవలందించాలి: కలెక్టర్


శిశు సంక్షేమ శాఖపై సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కృషి చేసి, ప్రభుత్వాశయాలకు అనుగుణంగా మహిళల అభివృద్ధికి, శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతగా పనితీరు ఉండాలని, మాత శిశు మరణాలు, మాల్ న్యూట్రిషన్ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై సిడిపీఓలు, సూపర్వైజర్లు, డిసిపిఓ, డిఎం మహిళా ప్రాంగణం వన్‌స్టాప్ సెంటర్ అధికారి, తదితరులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలు సంభవించకుండా ఆసుపత్రులలో ప్రసూతి కాన్పులు జరిగేలా చూడాలని ఆదేశించారు. మిషన్ వాత్సల్యపై సమీక్షిస్తూ సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు ఉండాలని మహిళా ప్రాంగణం ద్వారా మహిళలకు ఉపయోగపడే స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు మార్కెట్లో ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రానున్న మూడు నెలలలో మహిళా ప్రాంగణం, శక్తి సదన్‌లలో అనాధలు, వదిలి వేయబడిన వారు, భర్త లేని, సింగిల్ ఉమెన్ మహిళలకు 18 నుండి 60 సంవత్సరాల లోపు వారిని మరింత మందిని నిబంధనల మేరకు చేర్చుకుని వారికి వసతి , ఉచిత ఆహారం, ఆరోగ్య, వైద్య, లీగల్ సేవలు అందేలా చర్యలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే గుడ్లు సక్రమంగా అందేలా నాణ్యతగా ఉండేలా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని సిడిపిఓలు సూపర్వైజర్లకు ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని, వాస్తవ వివరాలు తెలిపి అందులోని సమస్యలను అధిగమించి లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు వారు విధులు నిర్వర్తిస్తున్న గ్రామాలలో అందుబాటులో ఉండాలని సిడిపిఓలు సూపర్వైజర్లు ఎలాంటి కంప్లైంట్లు లేకుండా పనితీరు ఉండాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు. జువెనైల్ జస్టిస్ బోర్డు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారిని జయలక్ష్మి, డిసిపిఓ శివశంకర్, వన్‌స్టాప్ సెంటర్ ఇన్చార్జి సిడిపిఓ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

భూ వివాద పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని చింతలచేను ప్రాంతంలో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ నిలుపుదల, 80 అడుగుల మాస్టర్ ప్లాన్ నిర్మాణంలో భూమిని కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లను మంజూరు చెయ్య లేదని శ్రీ పద్మావతి శేషసాయినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు హరి ఆధ్వర్యంలో దాదాపు వంద మందికి పైగా భూ బాధితులు బుధవారం తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులుని కలిసి సమస్యను వివరించారు. సమస్యను విన్న ఎమ్మెల్యే ఆర్‌డివో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్యలను పరిష్కరి స్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసి యేషన్ కార్యదర్శి ఈశ్వరయ్య, సభ్యులు కెవి.సత్య నారాయణ పాల్గొన్నారు.